తెల్ల పావురం

బొమ్మిడి అచ్చారావు

నూన్ షో వదిలారు.

శ్యామల థియేటర్ నించి బయటికొచ్చి రోడ్డెక్కింది. ఎండ మాడ్చేస్తోంది.

మధ్యాహ్నం రెండుగంటలు దాటి పదినిమిషాలయింది. కాలినడకనే వెళ్తోంది.

రోడ్డు తిరిగేచోట ఓ నలభైయేళ్ళ స్త్రీ ఆమెను చూసి చిరునవ్వు నవ్వింది.

శ్యామల తెల్లబోయి చూసిందామె వంక. గతంలో ఎప్పుడూ ఆమెను చూసివుండలేదామె.

"నీ పేరు శ్యామల కదూ!?" చనువుగా అడిగిందామె.

"అవును, మీ కెలా తెలుసు?!...." అన్నది శ్యామల.

"నువ్వు గాంధీనగర్ వెళ్ళాలి. అవునా?"

తలూపింది శ్యామల.

"రిక్షాలో వెళ్దాం. నేనూ అటే వెళ్తున్నాను."

శ్యామల వారించేలోగా ఆమె రిక్షాను కేకేసింది. బేరమాడకుండానే ఎక్కి కూచుని, ఇంకా రోడ్ మీద అలాగే నిల్చుండిపోయిన శ్యామలను చూసి "దా, ఎక్కు" అన్నదామె.

"మీరు వెళ్ళండి. నేను నడిచే వస్తాను. నా కలవాటే!" అన్నది శ్యామల మొహమాటంగా.

"భలేదానివే! రిక్షా బాడుగ నువ్వివ్వనక్కర్లేదు. దా, ఎక్కు మరి!" ఆమె తొందర చేసింది.

తప్పదన్నట్టు ఎక్కి కూచున్నది శ్యామల.

"నా పేరు అరుంధతి. నాకు నీ వయసు కూతురుంది" అన్నదామె.

శ్యామల ఒదిగి కూచుంది. అరుంధతి చాలా అధునాతనంగా అలంకరించుకున్నది. ఆమె ఒంటిమీది నుంచి మత్తుగొలిపే పరిమళం గుప్పున శ్యామల నాసికాపుటాల్ని సోకింది. వయసుకితగ్గ అలంకరణ చేసుకోలేదు అరుంధతి అనుకున్నదామె.

"నీకు సినిమాలంటే బాగా ఇష్టమనుకుంటాను!" అన్నది అరుంధతి.

శ్యామల నవ్వి వూరుకుంది.

"నాకూ ఇష్టమే! వచ్చిన ప్రతి సినిమా చూస్తాను. అయితే డబ్బులు మా ఆయన్ని అడగను. నేనే సంపాదించుకుంటాను" చెప్పింది అరుంధతి.

"అదెలా?" అప్రయత్నంగా అడిగింది శ్యామల.

అరుంధతి చిన్నగా నవ్వి, "తర్వాత చెప్తాను. నీ కూడా మీ ఆయన్నడక్కుండా డబ్బులు సంపాదించాలని వుంటే ఇప్పుడే చెప్తాను" అన్నది.

శ్యామలకి ఆమె మాటలు రుచించలేదు. భర్తకి తెలియకుండా, భార్య ఎలా సంపాదించగలుగుతుంది? అలా సంపాదించే డబ్బు ఆమెకేం సుఖమిస్తుంది? ఊహూఁ! ఆ ఆలోచనే రుచించలేదామెకు.

రిక్షా తాపీగా రోడ్డుమీద దొర్లుతోంది.

అరుంధతి శ్యామల ముఖంలో మారుతున్న రంగుల్ని గుర్తుపట్టింది.

"ఏ కోరికా తీరకుండా, ప్రతి పైసాకీ భర్తమీద ఆధారపడటం దుర్భరం సుమా! చివరికి పావలా మల్లె పూలు కొనుక్కోవాలన్నా భర్త గారి నడగాలి. ఛ.... ఛ....అంతకన్నా బానిస బతుకు మరోటి లేదు."

శ్యామల అప్పటికీ మాట్లాడలేదు.

శ్యామల భర్త బాబూరావు ఏదో గవర్నమెంటు ఆఫీసులో జవానుగా పని చేస్తున్నాడు. అతను తెచ్చే జీతం వాళ్ళిద్దరికీ, ఇద్దరు పిల్లలకి చాలీ చాలకుండా వుంటోంది. ఒక్కొక్కసారి నిత్యావసరాలకే చాలదు. ఇక సినిమాలు, షికార్లు అంటే యెలా సరిపోతుంది? శ్యామల కెన్నో తీరని కోరికలున్నాయి. అయినా జీవితంలో రాజీపడిపోయి బతికేస్తోంది.

ఇద్దరు పిల్లలు స్కూలు చదువుకొచ్చారు. ఉదయం పోయి సాయంత్రం నాలుగ్గంటలకి యింటికొస్తారు. భర్త తొమ్మిది గంటలకి పోయి ఆరుగంటలకి తిరిగొస్తాడు సాయంత్రం. ఈ లోపల శ్యామలకి కాలక్షేపం కాక పిచ్చెత్తి పోయినట్టుంటుంది. ఆ ఒంటరితనం నుంచి తప్పించుకోటానికి మార్నింగ్ షోలకి వెళ్తుంటుంది.

ఇప్పుడలాగే వెళ్ళి అరుంధతి కళ్ళబడింది.

"నీ కిష్టమయితే ఆ మార్గం చూపిస్తాను. ఇష్టం లేక

పోతే యీ విషయం యింతటితో మరచిపో!" అంది అరుంధతి.

ఇంతలో రిక్షా శ్యామల ఇల్లు సమీపించింది.

శ్యామల, రిక్షా ఆపించి దిగుతూ, "రేపొస్తే చెబుతాను" అంది.

అరుంధతి చిన్నగా నవ్వి, తలూపింది.

రిక్షా ముందుకి కదిలింది.

శ్యామల సాయంత్రంవరకూ ఆలోచిస్తూనే గడిపింది. అరుంధతి సూచించిన మార్గం ఆచరణీయంగా అనిపించటం మొదలెట్టింది. అసలింతకీ అరుంధతి యేం చెప్పదలచుకొంది?

స్పష్టాస్పష్టంగా, అదేమిటో శ్యామల మనసుకి తాకింది. గుండె ఝల్లుమన్నది. మగాడికి తెలియకుండా, ఆడది సంపాదించే మార్గం ఒక్కటే! ఒళ్ళమ్ముకోవటం!....

కంపరంగా అనిపించింది శ్యామలకి.

ఛ! ఛ! తనా స్థితికి దిగజారదు. ఎన్నటికీ తనా మార్గాన వెళ్ళదు, వెళ్ళలేదు. నీతిగా గంజి తాగటమే తన కానందం. పడుపు సొమ్ముతో వచ్చే పంచభక్ష్య పరమాన్నం తనకొద్దు. తనకి నీతి ముఖ్యం.

శ్యామల ఈ నిర్ణయానికొచ్చాక నిమ్మళంగా ఉండగలిగింది. అంతవరకు మెదడుని ఆలోచనలు తొలిచివేసి మనసుని చిరాకుపరిచాయి.

ఇంతలో స్కూలునించి పిల్లలు తిరిగొచ్చారు.

ముద్దులొలికే ఆ చిన్నారుల ముఖాలు చూడగానే ఆమెలో అంతవరకు ఏ మూలో వున్న సందిగ్ధం పూర్తిగా

ఎగిరిపోయింది.

పిల్లలిద్దర్నీ ప్రేమతో దగ్గరకు తీసుకొంది శ్యామల.

2

"మీరు తెచ్చే సొమ్ముతో ఇంట్లోకి సరుకులే రావటం లేదు. సరదాలు తీర్చుకోవటం కూడానా?" ఈసడింపుగా అంది సరళ.

రాజారావు చిరాగ్గా చూశాడు భార్యవంక.

"చూడు సరళా! మనం భాగ్యవంతులం కాము. నేను చేసే ఉద్యోగం గజిటెడ్ ఆఫీసర్ కాదు. ఓ సామాన్యమైన ప్రయివేట్ కంపెనీలో చిన్న గుమాస్తాని. నెలకి అయిదువంద లివ్వటమే గగనం మా యజమానికి. అది కాదని వదులుకొంటే మళ్ళీ ఆ మాత్రం ఇచ్చే ఉద్యోగం దొరకటం జరిగేపని కాదు. వచ్చిందాంతోనే సరిపెట్టుకోవాలి. తృప్తి లేకపోతే యెంత తెచ్చుకున్నా సరిపోదు" అనునయంగా చెప్పబోయాడు.

"ఇప్పుడు మనిద్దరికే చాలటంలేదు మీ ఆదాయం. రేపు మనకి పిల్లలు పుట్టుకొస్తారు. వాళ్ళ అవసరాలు చూడాలి. వాళ్ళని పెంచి పెద్దవాళ్ళని చెయ్యాలి. అన్నిటికీ డబ్బుతోనే పని."

"నిజమే! వాళ్ళ అదృష్టవంతులయితే నా జీతం పెరగొచ్చు. ఎప్పుడూ ఒకేలాగే వుంటుందా? ఈ లోపల అవకాశాలు వస్తే యే గవర్నమెంటు ఉద్యోగమో వెతుక్కుంటాను...."

"అవకాశాలు మిమ్మల్ని వెతుక్కుంటూ రావు. మీరే వాటిని వెతుక్కుంటూ వెళ్ళాలి. కాని మీరు యేమాత్రం ప్రయత్నం చెయ్యరు. మీ కాలి దగ్గరకే రావాలి అన్నీను."

"సరళా! ఇప్పుడే కదా కష్టపడి ఆఫీసు నుంచి వచ్చాను!? రాగానే, నీ నస ఏమిటి? నాకు మనశ్శాంతి ఉండక్కర్లేదా?"

"కడుపు శాంతి స్తేనే కదా, మనసు శాంతించేది!? ముందు కడుపునిండా మూడుపూటలు తినగలిగే దారి చూపించండి....ఆ తర్వాత మనసు గురించి ఆలోచించ వచ్చును."

రాజారావుకి చర్రున కోపమొచ్చేసింది.

"మీ నాన్న నిన్ను నాకు కట్టబెట్టే బదులు, పెద్ద ఆఫీసర్ నెవర్నయినా చూసి చెయ్యాల్సింది నిన్ను. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. నేను సంపాదించే దానితో సంసారం గడపలేకపోతే నన్ను వదిలేసి వెళ్ళిపో!" అంటూ చెప్పులు వేసుకొని విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

"వట్టి గొడ్డుకు అరుపు లెక్కువ. సంపాదన లేదుగానీ, పెళ్ళాం మీద విరుచుకుపడుతున్నాడు. ఏమన్నా చెల్లుతుందనే అహంకారం. మగవాడినన్న పొగరు...."

వెనుక నుంచి సరళ గొణుగుతూనే వుంది. కాని అప్పటికే రాజారావు రోడ్డెక్కి యెటో వెళ్ళిపోతున్నాడు.

వెనుతిరిగి లోనికొస్తున్న సరళ ఎవరో పిలుస్తున్నట్టనిపించి తలతిప్పి చూసింది.

గుమ్మంలో యెవరో అపరిచిత స్త్రీ నిల్చుని వుంది!

"ఎవరండీ మీరు? యెవరు కావాలి?" అనడిగింది సరళ.

ఆమె చిన్నగా నవ్వి, "నువ్వే కావాలమ్మా సరళా" అంది.

"నా పేరు మీకెలా తెలుసు? మిమ్మల్ని యెక్కడా చూసినట్టులేదు!" అంది ఆశ్చర్యంగా సరళ.

"నా పేరు అరుంధతి. నీ గురించి నాకు చాలా తెలుసు. చాలీచాలని సంపాదన నీ భర్తది. నిత్యావసరాలే తీరని గడ్డు పరిస్థితి.... అంతా తెలుసు నాకు" నవ్విందామె.

సరళ విస్తుపోయి చూసింది. "ఇలా కూర్చోండి. అంతా విన్నారన్న మాట!?.... ఏవో ఆర్థికసంబంధమైన యిబ్బందులు. ప్రతి యింట్లోనూ సహజంగా ఉండేవే కదా!" అంది.

అరుంధతి చెక్క కుర్చీలో కూచుంటూ, "నిజమేనమ్మా. ఆర్థికపరమైన యిబ్బందులు ప్రతి యింటా ఉంటాయి. కొందరు తెలివిగా వాటినుంచి తప్పించుకుని సంసారాన్ని సుఖమయం చేసుకొంటుంటారు. చాలా మంది దుఃఖభాజనం చేసుకుంటారు. నువ్వు తెలివైనదానివనే అనుకొంటున్నాను" అంది.

సరళ వెంటనే ఏమీ చెప్పలేదు.

"ఇంతకీ మీను చెప్పేదేమిటి?"

"భర్తకి ఆదాయంలో చేదోడువాదోడుగా ఉండటం భార్య బాధ్యత."

"నేను పెద్దగా చదువుకోలేదు. చేద్దామన్నా ఉద్యోగ మెవరిస్తారు?"

"నేను!"

"మీరా....?" ఆశ్చర్యంతో సరళ కళ్ళు విశాలమయ్యాయి.

"అవునమ్మా, నేనే! మామూలుగా ఆఫీసుల్లో పనిమల్లే గంటల తరబడి కష్టపడనక్కర్లేదు. అసలా మాట

కానీ కష్టమే కాదు సుఖమే! సుఖమైన సంపాదన మార్గం!"

సరళ అనుమానంగా చూసిందామె వంక.

"చాలీచాలని సంపాదనతో ఏ కోరికా తీరకుండా నిత్యం దరిద్రంలో మునిగిపోయే కంటే, మనకి చేతనైన రీతిలో చేతనైనంత సంపాదించటం మంచిది కదా!" అంది అరుంధతి.

"ఎలా?" అడిగింది సరళ.

"చెప్తాను. నీ కిష్టమైతే.... బలవంతం లేదు.... నువ్వు కావాలంటే నే చెప్తాను. నీ భర్తకి తెలియకుండా, అతను ఆఫీసునించి ఇంటికి తిరిగొచ్చేలోపల నీ పని పూర్తి చేసుకోవచ్చు. ఆ ఆదాయంతో నీ కావ్యాలనీనవన్నీ కొనుక్కోవచ్చు. నీకు తీరని కోరికలేమైనా వుంటే తీర్చుకోవచ్చు. ఏమంటావు?"

సరళ మనసు పరిపరివిధాల పోతోంది.

ఏం చెప్పబోతోం దీమె? అసలు ఈమె ఎవరు? తన సమస్యల్ని తీర్చటానికి ఎందుకు సిద్ధపడింది. తనకి ఆర్థిక సమస్యలున్నట్టు ఈమెకేలా తెలుసు?! కేవలం చాటు నుంచి విని గ్రహించిందా?

"అసలు మీరు చెప్పబోయే మార్గమేమిటి?"

"తీరా చెప్పాక అఫెండవకూడదు. సరేనా?!"

"చెప్పండి...."

అరుంధతి దగ్గరగా వచ్చి సరళ చెవిలో చెప్పింది.

సరళ ముఖం ఎర్రబడింది ఆ మాటలు వినగానే. ఆమె ఒంట్లో సన్నగా ప్రకంపనలు పుట్టాయి. ముఖంలో రంగులు మారాయి. ముక్కుపుటాలు అదిరాయి.

అరుంధతి ఆమెని పరీక్షగా చూస్తోంది. ఆమె మన

సులో చెలరేగుతున్న సంతోషాన్ని అంచనా వేస్తోంది.

"ఇందులో బలవంత మేమీ లేదు. నీ ఆర్థిక పరిస్థితిని చూసి బాధ కలిగి నీకీ మార్గాన్ని సూచించాను. ఇప్పుడైనా నీ కిష్టంలేకపోతే మానెయ్యవచ్చు."

సరళ ముఖం గంభీరముద్ర దాల్చింది.

"నేనెప్పట్నుంచి రావాల్సి వుంటుంది?" అంది స్థిరంగా.

అరుంధతి ముఖంలో ఆనందవీచికలు కదలాడాయి. భావయుక్తంగా నవ్వింది.

"రేపట్నుంచీ మొదలుపెడదాం" అంది.

సరళ మౌనంగా ఆలోచిస్తోంది.

3

ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజినుంచి బయటికొస్తున్న గోపాల్‌ని చూసి పలకరింపుగా నవ్వాడతను.

గోపాల్ మొహమాటంగా నవ్వాడు.

"నా పేరు స్వామి....నువ్వు ఎంప్లాయిమెంట్ కోసం ఈ ఆఫీసు చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతున్నావు, ఇంటర్వ్యూ కోసం పడిగాపులు కాస్తున్నావు. ఇంటర్వ్యూ వస్తే యింటికి తెలియపరుస్తారు కదా. ఆఫీసు చుట్టూ తిరగటం దేనికి?"

"ఒక్కోసారి పోస్టల్ అవ్యవస్థవల్ల ఇంటర్వ్యూ తేదీ దాటిపోయాక యింటిమేషన్ అందవచ్చునని భయంతో ప్రతిరోజూ వచ్చి కనుక్కొని వెళ్తున్నాను" అన్నాడు గోపాల్.

"అంటే.... ఉద్యోగాలు అంత విరివిగా దొరికిపోతున్నాయనుకుంటున్నావా? రోజూ ఖాళీలు వచ్చేస్తున్నాయని, వాటిని వెంటనే భర్తీ చేసేస్తున్నారని,

ఇంటిమేషన్ అందక అవకాశం పోతుందనీ నీ ఉద్దేశమును కుంటాను!?"

"నిరుద్యోగిని కదండీ! ఆశపడటం సహజం."

"కాని ప్రస్తుతపరిస్థితుల్లో ఉద్యోగం—అందునా గవర్నమెంటు ఉద్యోగం దొరకటం అంత తేలికేంకాదు. దానికెంతో ప్రొసీజర్ వుంది. ఉత్తర దక్షిణాలు కావాలి. కేవలం ఆశపడినంతమాత్రాన ఉద్యోగం వచ్చెయ్యదు."

"ఏం చెయ్యమంటారండీ! నాన్నగారు మరో నాలుగు నెలల్లో రిటైర్ కాబోతున్నారు. ఇంట్లో పెళ్ళికెదిగిన చెల్లెళ్ళు ఇద్దరున్నారు. చదువుకుంటున్న తమ్ముళ్లు ముగ్గు రున్నారు. వీళ్ళందరికీ నాన్న తెచ్చే వెయ్యిరూపాయల జీతమే ఆధారం. ఆయన రిటైరయ్యేలోపల యేదోక ఉద్యోగం చూసుకోవాలని నా తాపత్రయం."

"నీ ఉద్దేశం మంచిదే! కాని ఉద్యోగాలు అంత తేలిగ్గా దొరకవు. మనమే ఏదో చిన్న చిన్న పనులు చేసి డబ్బు సంపాదించుకోవాలి ఉద్యోగం దొరికే వరకు."

"చిన్న చిన్న పనులా? చదువుకున్నాను కదా—కూలినాలి చేయటానికి మనసొప్పదు. దానికి సిద్ధపడినా చదువుకున్నవాడిని ఆ పని చెయ్యలేనని ఎవరూ కూలిపని ఇవ్వరు. రెంటికి చెడిన రేవడిలాంటి స్థితి."

"చిన్నపనులంటే కూలిపనులు కాదు, నా అభిప్రాయం. నీ చదువుకి, నీ ఆత్మాభిమానానికి సరిపోయే పనిచేసు కోమని! అలాంటి పనేదైనా దొరికితే చెయ్యటానికి నీ కభ్యంతరమా?"

"అభ్యంతరమా? భలే అన్నారు!? ఎగిరి గంతేసి చేస్తాను. నాక్కావలసింది యేదోవిధంగా డబ్బు సంపా

దించి, మా నాన్నగారికి ఆర్థికంగా సాయపడటం! అంతే."

"'ఏదోవిధంగా' సంపాదించటం! కరెక్టు, నీకా మార్గం చూపిస్తాను. నాతో వస్తావా?"

"ఎక్కడికి?"

"చెప్తాను. నామీద నమ్మకముంటే నాతో రా! ఏం చెయ్యాల్సిందీ ఎలా చెయ్యాల్సిందీ చెప్తాను."

"మీమీద నాకు నమ్మకముంది."

"వెరీగుడ్! నువ్వు నాకు బాగా నచ్చావు. ఇక నీ కుటుంబానికి నువ్వొక పెద్ద ఎస్సెట్ అవుతావు. నీ చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు, నీ తమ్ముళ్ళ చదువు పూర్తవుతాయి."

"చాలు. నాకంతకన్న కావలసిందిలేదు" తృప్తిగా అన్నాడు గోపాల్.

స్వామి చిరునవ్వు నవ్వాడు.

4

"నగరంలో ఇప్పటివరకు ముప్పయిమంది నిరుద్యోగ యువకులు, పన్నెండుమంది వివాహిత మహిళలు అంతర్ధానమయ్యారు. దాదాపు వారం రోజుల వ్యవధిలో నే వీరందరు అదృశ్యమయ్యారు. మా డిపార్టుమెంట్ ని తికమకపరచి, అంతుచిక్కని కేసుగా, మాకో సవాల్ లా నిలిచింది కేసు" చెప్పాడు ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్.

డిటెక్టివ్ కిరణ్ సాలోచనగా చూశా డతని వంక.

శ్రీనివాస్ ఫైల్ అతనికందించాడు. అందులో అంతర్ధానమైన యువకుల, మహిళల ఫోటోలు, వాటి కింద వాళ్ళ వివరాలు వున్నాయి.

"నిరుద్యోగ యువకుల అంతర్ధానం గురించి రిపోర్టులు

తర్వాత వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి ఇన్వెస్టిగేట్ చేశావా."

"చేశాను."

"అందులో ఏమైనా ఆసక్తి కలిగించే అంశాలేమైనా గమనించావా?"

"దాదాపు అందరు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వాళ్ళే. నలుగురు పోస్టుగ్రాడ్యుయేట్స్, ఇద్దరు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్ కూడా వున్నారు. అందరిదీ ఒకటే సమస్య — ఆర్థిక సమస్య!"

"వాళ్లు అంతర్థానమైన రెండురోజుల తర్వాత వాళ్ళ ఇళ్ళకు ఎవరో అజ్ఞాత వ్యక్తులు డబ్బు తెచ్చి ఇచ్చారట. అయితే వాళ్ళ వివరాలు మాత్రం చెప్పలేదట."

"మరి ఆ వివాహిత స్త్రీల విషయం.....!?"

"అది మాత్రం ఇంకా పజిల్ లాగానే మిగిలిపోయింది. వాళ్ళ భర్తలు ఆర్థికంగా వెనకబడి వున్నవాళ్ళే. చిన్న చిన్న ఉద్యోగాలు, ప్రయివేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూన్నవాళ్లు!"

"వాళ్ళ భర్తలకూ డబ్బు అందచేయబడిందా?"

"లేదు."

"వాళ్ళ సంసార జీవితాల్లో అసంతృప్తి, అవగాహన లోపించటం, మనస్పర్థలువంటివి ఏమైనా వున్నాయా?"

"ఉన్నాయేమో తెలీదు, వాళ్ళు మాత్రం అలాంటి వేమీ లేవని చెప్పారు. భార్యల చిన్న చిన్న కోరికలు తీర్చలేకపోవటంతప్ప వాళ్ళమధ్య మరే గొడవలూ లేవని తేలింది."

కిరణ్ కొద్దిక్షణాలు మౌనంగా వుండిపోయాడు.

ఈ యువతుల్ని యెవరు తీసుకుపోయారు? బలవంతాన

తీసుకుపోవటం జరగలేదని, వాళ్లు ఇష్టపూర్వకంగానే యెక్కడికో వెళ్ళిపోయుంటారని అర్థమవుతోంది— వాళ్ళ తరఫున సొమ్ము వాళ్ళ ఇళ్ళకు అందడం గురించి ఆలోచిస్తే.

అందరూ నిరుద్యోగులే. అందరూ యువకులే. ఈ దేశంలో నిరుద్యోగులకు కొదవలేదు. కాని, ఒకేసారి ముప్పయిమంది అంతర్ధానం కావటం, రెండునెలల తర్వాత వాళ్ళ ఇళ్ళకు డబ్బు అందజేయబడటం—అంతా ఓ ప్లాన్ ప్రకారం జరిగినట్టు కనిపిస్తోంది.

ఆ యువకుల్ని యెవరు మాయం చేశారు? ఏమాశించి?

కణతలు రుద్దుకున్నాడు కిరణ్.

సంసారం చేసుకుంటున్న స్త్రీలని కూడా ఆ మనుషులే మాయం చేశారా? లేక వేరు వేరు ముఠాలు చేసిన పనా? పెళ్ళికాని అందమైన యువతులు అంతర్ధానం కావటం సర్వసాధారణంగా జరిగేదే! అందుకు సరయిన కారణాలుకూడా వుండొచ్చు.

కాని, కొన్నాళ్ళు భర్తలతో కాపరం చేసిన ఆడవాళ్ళతో ఎవరికి యెలాంటి పనిపడిందా?

తల విదిలించాడు కిరణ్.

"ఎలాగైనా ఈ కేస్ ట్రేక్ చెయ్యాలి బ్రదర్. ఇది మా డిపార్టుమెంట్ ప్రెస్టేజ్‌కి సంబంధించిన విషయం. ఇప్పటికింకా యేవిధమైన క్లూ దొరకలేదు. అసలు వీళ్ళందరూ మాయం కావటానికి మోటివ్ కూడా యేమీ అంతుబట్టలేదు. చాలా అరుదైన కేసు" చెప్పాడు శ్రీనివాస్.

కిరణ్ సాలోచనగా చూశాడతనివంక.

"ఓసారి ఆ స్త్రీల యిళ్ళకు వెళ్ళొద్దాం" అన్నాడు.
శ్రీనివాస్ తలూపాడు.

5

కాషియర్ ఇచ్చిన నోట్లకట్టలని బ్రీఫ్‌లో సర్దుకున్నాడు పరాంకుశం.

డబ్బు విషయంలో తన దగ్గర పని చేస్తూన్న సిబ్బందిని నమ్మడు పరాంకుశం. అందుకే చిన్న ఆటో మొబైల్ షెడ్‌ని ఈ రోజు నగరంలోకల్లా పెద్ద ఆటోమోటివ్ లిమిటెడ్ సంస్థగా యెవరూ ఊహించనంత ఎత్తుకి అభివృద్ధి చేశాడు. తను ఎదిగాడు, తన సంస్థలో కొన్ని వేలమందికి ఉపాధి కల్పించాడు.

అయితే పరాంకుశం న్యాయంగా సంపాదించింది చాలా తక్కువ. అసలు న్యాయం అనే మాటకు అతని డిక్షనరీలో అర్థమే లేదు!

ఆ రోజు వర్కర్సుకి పే డే! ప్రతి నెలా మొదటి తేదీన ఠంచనుగా జీతాలు చెల్లిస్తాడు పరాంకుశం. అది యెన్నో యేళ్ళుగా వస్తూన్న ఆచారం. అయితే పని వాళ్ళ శ్రమకుతగ్గ జీతమిస్తూన్నాడా అంటే లేదనే చెప్పాలి! బోనస్‌లు, ఇంక్రిమెంట్లు వంటివి వర్కర్సుకివ్వటంవల్ల వాళ్ళలో సోమరితనాన్ని పెంచినట్టే అవుతుందని అతని అచంచల విశ్వాసం.

అలాంటి పరాంకుశం, కేషియర్ ఇచ్చిన కొత్త నోట్లకట్టలని కూడా ప్రతి నోటూ విడవకుండా లెక్కించిగాని బ్రీఫ్‌లో సర్దుకోలేదు.

డ్రైవర్‌నికూడా వెంట తెచ్చుకోడు పరాంకుశం. క్యాష్ డ్రా చేసేటప్పుడు డ్రైవర్ డబ్బాశతో తనని యెక్కడో యేక్సిడెంట్ చేసి డబ్బు పట్టుకుని పారి

పోతాడని అతని అనుమానం.

అనుమానం ముందుపుట్టి పరాంకుశం తర్వాత పుట్టాడని చెప్పుకుంటారందరు.

బ్యాంక్ నించి సరాసరి తన ఫ్యాక్టరీకి కారును తోలుకొని వెళ్తున్నాడు పరాంకుశం.

ఊరికి బాగా చివరగా ఇండస్ట్రియల్ యేరియాలో వుందతని ఫ్యాక్టరీ! మధ్యలో దాదాపు యెనిమిది కిలోమీటర్ల దూరం పూర్తిగా నిర్మానుష్యంగా, యెలాంటి కట్టడాలు లేకుండా వుంటుంది.

సిటీ లిమిట్స్ దాటి జనావాస ప్రాంతందాటి సర్రున సాగిపోతోంది కారు.

సరిగ్గా అప్పుడే అతని మెడమీద చల్లగా తగిలింది.

పరాంకుశం పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. అది రివాల్వర్ మొన అని అతనికి తెలుసు! అయితే తన కార్లో తనతోబాటు మరో మనిషి ప్రయాణం చేస్తున్న విషయం తెలియదు.

“కారు ఆపి పక్కగా నిలబెట్టు” అన్నది వెనక నుంచి కర్కశమైన గొంతు.

పరాంకుశం వెంటనే ఆపలేదు కారు.

అతని మెడకి రివాల్వర్ గొట్టం బాగా ఒత్తుకున్నది.

పరాంకుశం వెన్నులో చలిపుట్టింది. ప్రాణభయం అతని నరనరాన పాకి, అతని కాళ్ళు బ్రేక్‌ని అదిమాయి.

కీచుమని శబ్దం చేస్తూ కారాగింది. వెనక కూచున్న వ్యక్తి రివాల్వర్ మడమతో పరాంకుశం నెత్తిమీద కొట్టాడు.

అంతే, పరాంకుశం తల పక్కకు వాలిపోయింది.

“ఏం చేద్దాం ఇతన్ని?” అడిగాడు అంతదాకా రివా

ల్యార్‌ని పరాంతకానికి గురిచేసి వుంచిన దిలీప్.

గోపాల్ చిన్నగా నవ్వి, "స్వామి ఆదేశం మేరకు మనం ఈ కార్లో యితన్ని ఇలాగే నడిరోడ్డుమీద వదిలేసి బ్రీఫ్‌లోని సొమ్ము మన గోతాములో వేసుకొని మన కార్లో వుడాయించటమే!" అన్నాడు.

చేతులకి గ్లోవ్స్ వేసుకున్నారిద్దరు. బ్రీఫ్‌లోని నోట్ల కట్టలను తమ వెంట తెచ్చిన గోతాములో సర్దుకుని కారు దిగారు.

అక్కడికి పది మీటర్ల దూరంలో బ్రౌన్ కలర్ మారుతీ కారు సిద్ధంగా వున్నది.

గోపాల్, దిలీప్ మారుతి కారు సమీపించారు. ఓసారి కారు లోపల పరీక్షగా చూసుకొని, ఎవరూ లేరని నిర్ధారణ చేసుకున్నాక కారెక్కారు. గోపాల్ డ్రైవింగ్ సీట్లో కూచున్నాడు. దిలీప్ వెనక సీటుకింద గోతాము దాచాడు.

మరుక్షణం మారుతీకారు మహావేగంగా సిటీవైపు దూసుకుపోయింది.

6

"ఏమాలోచించుకున్నావు?" అన్న మాటవిని దిగ్గున తలెత్తి చూసింది శ్యామల.

ఎదురుగా చిరునవ్వుతో అరుంధతి!

ఆమెను చూడగానే ఒంటిమీద తేళ్ళు, జెర్రులు పాకినట్టు అనుభూతి చెందింది శ్యామల..

"నాకు ఈ జీవితమే బావుంది. నా భర్త తెచ్చే సంపాదనతో హాయిగా గడిచిపోతుంది. నాకు పెద్దగా కోరికలేవు. మీ అవసరం యెప్పటికీ రాదు, రాకూడదని కోరుకుంటున్నాను."

శ్యామల మాటలకు అరుంధతి నవ్వింది.

"చాలా పిచ్చిదానివి నువ్వు. నేను నిన్ను కాని పని చెయ్యమన్నానా? నీ భర్తకు తెలియకుండా సంపాదించే మార్గం చెపుతానన్నాను, కాని చెప్పలేదు కదా!? అదేమిటో తెల్సుకోవాలని కూడా నీకనిపించటం లేదా?"

"భర్తకి తెలియకుండా ఆడది సంపాదించే మార్గమేమిటో నాకు తెలుసు!"

"అందుకే నువ్వు పిచ్చిదానివన్నాను. అదేమిటో చెప్పనా?"

"వద్దు, వద్దు. వినే ఓపికూడా లేదు నాకు. అదేమిటో నాకు తెలుసు. మీరు వెళ్ళొచ్చు."

"నీకు తెలిసిందేమిటో చెప్పు."

"ఆ నీతిమాలిన మాట నేను నా నోటితో ఉచ్చరించలేను."

"అక్కడే పొరబడుతున్నావు. నేను నిన్ను నీతిమాలిన పనేదీ చెయ్యమని అడగలేదే! గౌరవప్రదంగా, నీ నీతి నియమాలకు, ఆత్మగౌరవానికి భంగంలేని పనే అది...."

శ్యామల విచిత్రంగా చూసిందామె వంక.

"అవునమ్మా, నా మాట నమ్ము.... ఇలా నా దగ్గరగా రా.... ఒక్క క్షణం నీ చెవినిలా పారెయ్...." అంటూ మెల్లగా గొణిగింది శ్యామల చెవిలో.

ఆ మాట వింటూనే శ్యామల నిటారుగా అయింది. ఆమె శరీరం సన్నగా కంపించింది. ఆశ్చర్యంతో ఆమె విశాల నేత్రాలు మరింత విశాలమయ్యాయి.

"ఆ పని నావల్లనవుతుందంటావా? అమ్మో నాకు భయం!" అన్నది గొంతు పెకల్చుకుని.

"భయం దేనికి పిచ్చిపిల్లా! నువ్వొక్కదానివే కాదు

గదా, నీలాంటి అమ్మాయిలు చాలామంది వున్నారు. వాళ్ళందరితోను కలిసి ఈ పనిలో పాల్గొనటం చాలా ఆనందంగా వుంటుంది నీకు... ఏమిటి, వస్తావా?"

శ్యామల కాసేపు మౌనం వహించింది.

"నీ పిల్లలిద్దరి భవిష్యత్తు ఉజ్వలంగా వుండాలని నీకు కోరిక లేదా? వీటన్నిటికీ కావలసిన డబ్బు చాలా సునాయాసంగా నీకు లభించే మార్గం ఇది తప్ప మరొకటి లేదు."

అరుంధతివైపు సీరంగా చూసి, "నేను సిద్ధమే! ఎప్పుడు రావాలి?" అన్నది శ్యామల.

అరుంధతి నవ్వి, "ఈ రోజునుంచే!" అన్నది.

7

"అంతర్ధానమైన యువకుల యిళ్ళకు సమానంగా డబ్బు అందచెయ్యబడింది. అంటే ముప్పయిమంది యువకుల్ని ఒకే ముఠా మాయంచేసిందని అర్థమైపోయింది. అయితే మాయమైన స్త్రీల విషయంలో అలా జరగ లేదు. అసలు వాళ్ళ ఇళ్ళలో డబ్బు అందచెయ్యటంగాని వాళ్ళ భర్తలకు వాళ్ళగురించిన క్షేమసమాచారం అంద చెయ్యబడటంగాని జరగలేదు. దీన్నిబట్టి రెండు ముఠాలు ఇందులో పనిచేస్తున్నాయని గ్రహించవచ్చు" అన్నాడు డిటెక్టివ్ కిరణ్.

శ్రీనివాస్ అతనివంక సాభిప్రాయంగా చూశాడు.

అంతక్రితమే వాళ్ళిద్దరు అంతర్ధానమైన యువకుల, మహిళల ఇళ్ళకు వెళ్ళి ఎంక్వయిరీ పూర్తిచేసుకుని వచ్చారు.

"ఈ వారంరోజుల కాలంలోను దేశంలోని ఎయిర్ పోర్టునుంచి, నౌకాశ్రయంనుంచి ఎవరెవరు ఏయే తేదీల్లో

ప్రయాణించినది, విదేశాలకు ఎంతమంది ప్రయాణించినదీ వివరాలు సేకరించు. మాయమైన యువకులు మహిళల పేర్లు మారిపోయి వుండొచ్చు. వాళ్ళ వయసులు, తక్కిన ఫిజికల్ ఐడెంటిఫికేషన్స్ బట్టి మనం ఇన్వెస్టిగేట్ చేయాల్సి వుంటుంది" చెప్పాడు కిరణ్.

"అంటే వాళ్ళను విదేశాలకు తరలించి వుండొచ్చునని నీ అనుమానమా?"

"కావచ్చు. ఎన్ని విధాల అవకాశాలున్నాయో అవన్నీ మనం వెరిఫై చేసుకోవాలి. అంతర్ధానమైనవాళ్ళు నగరంలోనే వుంటే ఏదొక సమయంలో తమవాళ్ళని చూడటానికో తను క్షేమవార్త తెలియచెయ్యటానికో తమ ఇళ్ళకు వచ్చి వుండేవాళ్ళు...."

ముప్పయ్యేళ్ళ యువకుడు లోనికొచ్చి డిటెక్టివ్ లకి నమస్కరించాడు.

"నా పేరు బాబూరావు సార్! నా భార్య శ్యామల కనిపించటంలేదు" అన్నాడతను.

డిటెక్టివ్ కిరణ్ ఎలర్టుగా అయాడు. శ్రీనివాస్ అతన్ని కూచోమని చెప్పి, "వివరంగా చెప్పండి!" అన్నాడు.

బాబూరావు గొంతు సవరించుకుని, "నేను అటెండర్ గా పనిచేస్తూన్నాను సార్, మెడికల్ డిపార్టు మెంట్లో. నా భార్య శ్యామల. మా కిద్దరు పిల్లలు. ఈ రోజు సాయంత్రం నేనొచ్చేసరికి పిల్లలిద్దరు ఇంట్లో బిక్కు బిక్కుమంటూ వున్నారు. శ్యామల పక్కింటి వాళ్ళకు తాళం యిచ్చి వెళ్ళిందట. సాయంత్రానికల్లా తిరిగొచ్చేస్తానని చెప్పిందట. ఉదయం నేను ఆఫీసుకి వెళ్ళిన గంటకే వెళ్ళిందట. ఇప్పటిదాకా తిరిగిరాలేదు.

వాకేదో అనుమానంగా వుంది" అన్నాడు.

"ఏదైనా సినిమాకు వెళ్ళిందేమో!?"

"అలాంటిదేమైనా ఉంటే ముందుగా నాతో చెప్తుంది సార్! సాధారణంగా మార్నింగ్ షోలకే వెళ్తుంది. పిల్లలు వచ్చేస్తారని మేట్నీషోకి వెళ్ళదు. ఎప్పుడైనా ఫస్టుషోకయితే అందరం కలిసే వెళ్తాం. మేట్నీకి వెళ్ళినా ఈపాటికి వచ్చేయాలి కదా!? రాత్రి ఎనిమిది కావస్తోంది కదా సార్!" అన్నాడు బాబూరావు.

శ్రీనివాస్ నోట్ చేసుకుంటున్నాడు.

"ఎప్పుడైనా ఇలా చెప్పకుండా వెళ్ళటం జరిగిందా?"

"లేదు సార్, ఇదే మొదటిసారి!"

"మీమధ్య యేమైనా పోట్లాటవంటిది జరిగిందా నిన్న రాత్రిగాని, అంతక్రితంగాని?"

"అలాంటిదేంలేదు సార్! ఎప్పుడైనా అది లేదు, ఇదిలేదని సాధిస్తూంటూంది. నాకొచ్చే జీతంతో అవన్నీ కొనలేనని మందలిస్తూంటాను. ఆమె కూడా అలాగే సర్దుకుపోతుంది. అంతకిమించి మరే విషయంలోను మా మధ్య మనస్పర్థలు రావు...." చెప్పాడు బాబూరావు.

"ఆమె ఫోటో, వయసు వగయిరా వివరాలు కావాలి" అన్నాడు శ్రీనివాస్.

బాబూరావు ఫోటో ఇచ్చి వివరాలు చెప్పి వెళ్ళటానికి లేచాడు.

"ఆమెకీ తెలిస్తే వెంటనే మీకు తెలియపరుస్తాం. ఈ లోపల మీ కేమైనా ఇన్ఫర్మేషన్ తెలిస్తే మాకు

తెలియజెయ్యండి" అన్నాడు శ్రీనివాస్.

బాబూరావు సెలవుతీసుకొని వెళ్ళిపోయాక, "పద మూడో మహిళ అంతర్ధానమయ్యింది. పైగా ఇద్దరు బిడ్డల తల్లి!" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ సాలోచనగా తలూపి, "ఇప్పటివరకు అందరు వివాహితులైన మహిళలే రికార్డయ్యారు. పిల్లల తల్లులు పదిమంది ఉన్నారు. తక్కిన ముగ్గురికి సంతానం లేదింకా. అయితే అందరూ యిరవై—యిరవై అయిదేళ్ళ మధ్య వయస్కులు కావటం గమనించాల్సిన అంశం....!" అన్నాడు.

శ్రీనివాస్ అరచేతుల మధ్య తల పట్టుకొని కూచున్నాడు.

సరిగ్గా అప్పుడే ఫోన్ మోగింది. అందుకొని వెంటనే అటెన్షన్‌లోకి వచ్చేశాడు. "ఆఁ....అలాగే సర్...." అంటూ అన్నిటికీ వినయంగా ఊకొడుతూ చివర్న ఫోన్‌లోనే నమస్కారం పెట్టేసి రిసీవర్ క్రెడిల్ చేసి కిరణ్ వైపు తిరిగి, "కమిషనర్ నించి. ఈ కేసు విషయంలో ఎలాంటి ప్రోగ్రెస్ లేకపోవటం క్షమార్హం కాదని తలవాచేలా చీవాట్లేసి, ఎక్స్‌ప్లనేషన్ కాల్ ఫర్ చెయ్యాల్సి వుంటుందని హెచ్చరించారు."

కిరణ్ మందహాసం చేశాడు.

సరిగ్గా అప్పుడే ఫోన్ మోగింది. శ్రీనివాస్ భయంగా చూశాడు దానివైపు. ఫర్వాలేదు, తీసుకోమన్నట్టు చూశాడు కిరణ్.

శ్రీనివాస్ ఫోనెత్తి "హలో క్రైమ్‌బ్రాంచ్!" అన్నాడు మెల్లిగా.

"నేను 'పరాంకుశం ఆటోమోటివ్స్ లిమిటెడ్' నుంచి

పరాంకుశం మాట్లాడుతున్నాను. మీరు వెంటనే ఇక్కడికి రావాలి. మూడులక్షల నల్లభైవేలు దొంగలు దోచేశారు. నన్ను నడిరోడ్డుమీద కొట్టిపడేశారు. ఇక్కడికొచ్చాక వివరాలు చెపుతాను. ప్లీజ్, వెంటనే రండి!" అవతల్నుంచి యెంతో కంగారుగా వినిపించింది.

కిరణ్ కి కూడా వినిపించింది స్పష్టంగా.

"ఇప్పుడే వస్తున్నాము!" అంటూ ఫోన్ పెట్టేసి కిరణ్ వైపు చూశాడు శ్రీనివాస్.

కిరణ్ రెండుక్షణాలేదో ఆలోచించి, "పద నేనూ వస్తాను" అన్నాడు.

సిబ్బందితో శ్రీనివాస్ జీప్ లోను, వెనగ్గా తన టయోటాలో కిరణ్—ఇండస్ట్రియల్ యేరియావైపు సాగిపోయారు.

8

"సరుకు నిఖార్సేనా?" అడిగాడు సేట్, గుంభనంగా నవ్వుతూ.

అతని చూపులు తోడేలు చూపుల్లా వున్నాయి. కళ్ళు చిరుతకళ్ళలా తళ తళా మెరుస్తూన్నాయి. కోడిపిల్ల నెత్తుకుపోవటానికి కాచుకొన్న డేగలా వున్నాడు.

అరుంధతి నవ్వింది.

"చూసుకోండి సేట్ జీ, యెప్పుడైనా తకురారు వచ్చిందా?" అంది.

సేట్ జీ శ్యామలవంక చూశాడు. శ్యామల చైనా సిల్క్ చీరలో నిలువెల్లా మెరిసిపోతోంది. సేట్ జీ చూపులు ఆమెను నఖశిఖపర్యంతం గుచ్చి గుచ్చి చూస్తున్నాయి.

శ్యామల కిది చాలా ఇబ్బందిగా ఉంది. ఒంటికి కారం

రాసుకున్నట్టుంది. అయినా భరించాలి, తప్పదు!

"సేట్ జీ, సరిగా చూసుకున్నారా?" అన్నది అరుంధతి.

అప్పుడు పడింది సేట్ దృష్టి శ్యామల చేతిలోని నగ మీద.

దాన్ని చేతిలోకి తీసుకొని అటు ఇటు చూసి గీటు చూడకుండానే, "ఏభై వేలు చేస్తుంది. అంతకన్నా ఇచ్చేదిలేదు" అన్నాడు.

శ్యామల అతని కళ్ళలోకి చూసి మనోహరంగా నవ్వింది.

సేట్ పెదాలు తడుపుకున్నాడు.

"మరో పదివేలిస్తాను, అంతే!" అన్నాడు.

"డెభై అయిదు చేసుకోండి సేట్ జీ!" అన్నది శ్యామల.

"నువ్వడిగావు కాబట్టి ఒప్పుకుంటున్నాను" అంటూ నగ కేష్‌బాక్స్‌లో పడేసి, వందరూపాయల నోట్లు లెక్కించి శ్యామల కిచ్చాడు. ఇస్తూ కావాలనే ఆమె చేతిని మృదువుగా తాకాడు.

శ్యామల అందంగా సిగ్గుపడింది.

"ఏమైనా వీలవుతుందా?" అన్నాడు సేట్ అరుంధతితో గుసగుసగా.

అరుంధతి సేట్ చేతిమీద సన్నగా గిల్లి, "సాయంత్రం ఆరుగంటలకి కబురు పెడతాను. హోటల్ ఇంపీరియల్ రూం నెంబర్ ఫార్టీయైట్‌కి వచ్చెయ్యండి!" అన్నది.

సేట్ ఆనందంగా తలూపి, శ్యామలవంక తేరగా చూశాడు.

అప్పుడు సాయంత్రం నాలుగ్గంటలయింది.

బయటికొచ్చి కారెక్కారు శ్యామల, అరుంధతి.

కార్లోనే డబ్బు అరుంధతి చేతి కిచ్చేసింది శ్యామల.

"నన్ను మా యింటివద్ద దిగబెట్టండి. ఈ పాటికి పిల్లలు స్కూల్ నుంచి వచ్చేసి వుంటారు" అన్నది శ్యామల.

అరుంధతి చిన్నగా నవ్వి "అప్పుడేనా? యిప్పటికి మనం అనుకొన్న పని సగం మాత్రమే అయింది. సాయంత్రం ఆరుగంటలతో పని పూర్తవుతుంది. ఆ తర్వాత వెళ్ళిపోవచ్చును" అంది.

"అప్పటికి మా వారు ఆఫీసునించి తిరిగొచ్చేస్తారు. మా వారు రాకముందే వెళ్ళిపోతే యెలాంటి సమస్య రాదు."

"ఇప్పుడు కూడా యెలాంటి సమస్య రాదు. మేట్నీ సినిమా చూసి యింటికి తిరిగొచ్చానని చెప్పుకోవటానికి వీలుగా వుంటుంది. దూరంగా వున్న సినిమా పేరు చెప్పు. నడిచివచ్చేటప్పటికీ ఆ టైము అవుతుంది కదా! ఎలాంటి అనుమానం రాదు మీ ఆయనకి."

శ్యామల అయిష్టంగానే ఒప్పుకున్నది.

తనేమి తప్పు చెయ్యకపోయినా ఆమె మనసు యేదో తప్పుచేసిన భావనతో నలిగిపోతోంది. భర్తకి తెలియకుండా అలా స్వతంత్రించి వ్యవహరించటం తప్పని అంతరాత్మ పదేపదే హెచ్చరిస్తోంది.

"ఇదిగో, ఈ పదివేలు నీవి!" అరుంధతి వందరూపాయల నోట్లు శ్యామల గుప్పెట్లో పెట్టింది.

అన్ని నోట్లు ఒక్కసారి యెప్పుడూ చూడకపోవటంతో ఆనందంతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి. అంత

వరకు ఆమెను భయపెట్టిన సంశయాలన్నీ దూదిపింజెల్లా ఎగిరిపోయాయి. ఏదో సమాధానం చెప్పుకోవచ్చునన్న ధీమా ఆమెలో చోటు చేసుకున్నది.

హోటల్ ఇంపీరియల్ ముందు కారాగింది.

రూం నెంబర్ ఫార్టీఎయిట్‌కి లిఫ్ట్‌లో వెళ్ళారు అరుంధతి, శ్యామల,

ఒక్కసారిగా తన అంతస్తు పెరిగిపోయినట్టనిపించింది శ్యామలకి నాలుగో అంతస్తు చేరుకోగానే.

“బాగా విశ్రాంతి తీసుకో! కాఫీ తెప్పిస్తాను. టిఫిన్ యేది కావాలో ఆర్డరివ్వు బోయ్ తెస్తాడు” అన్నది అరుంధతి.

శ్యామలకి బాగా ఆకలిగా ఉంది. ఉదయం భర్త ఆఫీసుకి వెళ్ళాక యేదో యింత తిన్నది. ఆ వెనువెంటనే అరుంధతి వచ్చి ఇలా తీసుకొచ్చేసింది.

టిఫిన్ తిని కాఫీ తాగింది శ్యామల.

కళ్ళ మీదకి నిద్ర కూరుకువస్తున్నట్టనిపించింది.

అరుంధతి అంతకితమే పనిమీద యెక్కడికో వెళ్ళింది. సరిగ్గా ఆరుగంటలకి తిరిగొస్తానని చెప్పింది. లోపల బోల్టు పెట్టుకోమన్నది. ఆమె చెప్పినట్టే చేసింది శ్యామల.

మగతగా నిద్రపడుతున్న సమయంలో మెల్లగా తలుపు తట్టిన సవ్వడి వినిపించి లేచి కూచున్నది శ్యామల.

తలుపు తెరిచింది!

ఎదురుగా చిరునవ్వుతో అరుంధతి!

“చెప్పిందంతా గుర్తుంది కదూ! ఏమాత్రం తేడా రాకూడదు” అన్నది అరుంధతి.

శ్యామల మౌనంగా తలూపింది. ఆమెకు లోలోపల

చాలా భయంగా వుంది. తనేదో విషవలయంలో చిక్కుకుపోతున్నట్టు అనిపించసాగింది.

పదే పదే భర్త పిల్లలు గుర్తొస్తున్నారు. వాళ్ళకేదో అన్యాయం చేస్తూన్నట్టు అనిపిస్తోంది. ఓపక్క పదివేల రూపాయలు ఆమెను పెద్ద ప్రలోభంలో పడేస్తుంటే, మరోపక్క రకరకాల అనుమానాలు మనసును నొక్కి పడుతున్నాయి.

అరుంధతి ధైర్యం చెప్పి వెళ్ళిపోయింది.

సరిగ్గా మరో పదినిమిషాలకి మళ్ళీ తలుపుమీద చిన్నగా శబ్దమయ్యింది.

శ్యామల తలుపు తెరిచింది.

ఎదురుగా సేఠ్ జీ! ఖరీదైన విస్కీ వాసన, ఖరీదైన సెంటు వాసనతో మిళితమై ఒక్కసారిగా గుప్పున ఆమె నాసికాపుటాలను సోకింది.

నోరంతా రక్తంలా పాన్ నలుగుతోంది అతని పళ్ళ మధ్య.

తలుపులు దగ్గరగా మూసి బోల్టు పెట్టాను.

శ్యామలకి గుండె దడ హెచ్చింది. ఎందుకు ఒప్పుకున్నానా అని పదేపదే తనని తాను నిందించుకుంటోంది.

సేఠ్ జీ బాగా దగ్గరగా వచ్చి ఆమె నందుకోబోయాడు, తుమ్ బహుత్ సుందర్ దిఖ్ తీహో!" అంటూ.

అతని పట్టుకు చిక్కకుండా దూరంగా జరిగింది శ్యామల.

సేఠ్ జీ నవ్వుతూ దగ్గరకొస్తూన్నాడు. అతని రెండు చేతులకు అయిదేసి చొప్పున వజ్రపుటుంగరాలు ఫ్లోరసెంట్ వెలుగులో ధగధగ మెరిసిపోతున్నాయి.

మెళ్ళో చాలా బరువైన చైయిన్ లాల్చీ మీదుగా

వేలాడుతోంది. చెవులకి డైమండ్స్ పొదిగిన పోగు లున్నాయి — కరచరణాలకి మల్లే. అవికూడా చాలా బరువుగా ఊగుతున్నాయి చెవులను కిందికిలాగుతూ.

సేఠ్‌జీ శ్యామలను దొరకబుచ్చుకున్నాడు. మనసులో భగవంతుడ్ని స్మరించుకుంటోంది శ్యామల.

ఆమెను బలంగా పట్టుకొని పడక దగ్గరకు నడిపించుకు పోయాడు సేఠ్‌జీ.

సరిగ్గా అప్పుడే తలుపుమీద టకటకమని శబ్ద మయ్యింది.

సేఠ్‌జీ, శ్యామల ఉలిక్కిపడ్డారు.

సేఠ్‌జీ వారించబోయేంతలో శ్యామల తలుపులు తెరిచింది.

బయట పోలీస్ ఇన్‌స్పెక్టర్, నలుగురు కానిస్టేబిల్సు నించుని వున్నారు.

వాళ్ళని చూడగానే సేఠ్ ప్రాణాలు పైనే పోయాయి.

బిలబిలమంటూ లోపలికొచ్చి వాళ్ళిద్దర్ని చుట్టుముట్టే రారు పోలీసులు.

9

పరాంకుశం చెప్పిందంతా శ్రద్ధగా విన్నాడు డిటెక్టివ్ కిరణ్.

పరాంకుశం తలమీద బాండేజి వున్నది. బాండేజి పైకి ఎర్రగా రక్తం చిందివున్నది.

పరాంకుశం చాలా దిగులుగా వున్నాడు. డబ్బు పోగొట్టుకున్నందుకు బాగా డీలాపడిపోయాడు. నిజానికి ఆ మొత్తం అతనికి ఓ లెక్కలోది కాదు. అయినా ఒక్కసారిగా మూడులక్షల నలభై వేలు పోగొట్టుకోవటం

అతన్ని బాగా కంగదీసింది.

"మిమ్మల్ని యే స్పాట్‌లో బెదిరించారో అప్పుడు మీ కే స్థితిలో వున్నారో అదంతా వివరంగా మాకు చూపించండి" అన్నాడు కిరణ్

పరాంకుశం తన కారులో దొంగలు తనని అటకాయించి గాయపరిచిన ప్రాంతం దగ్గరకు తీసుకువెళ్లాడు.

సరిగ్గా ఆ కారు ఆగిన ప్రదేశానికి పదిమీటర్ల దూరంలో యేదో వస్తువు హెడ్‌లైట్సు వెలుగుల్లో మెరుస్తూ కనిపించింది కిరణ్‌కి.

రెండంగల్లో అక్కడికి చేరుకుని ఆ వస్తువును అందుకున్నాడు.

అది వెండి డాలరు!

దానిమీద స్వేచ్ఛగా గాల్లో ఎగురుతున్న తెల్లటి పావురం బొమ్మ వున్నది.

డాలర్‌ని వెనక్కి తిప్పాడు కిరణ్.

'సర్వ మానవ సౌభ్రాతృత్వం మన ధ్యేయం' అన్న అక్షరాలు మిలమిల మెరుస్తూన్నాయి.

కిరణ్ కొద్దిసేపటివరకు ఆ బొమ్మను, అక్షరాలను చూస్తూ నిల్చుండిపోయాడు.

అతని దృష్టిని నేలమీద స్పష్టంగా కనిపిస్తూన్న టైరు గుర్తులు ఆకర్షించాయి.

ఒంగి చూశాడు. చాలా చిన్న కారు కొంతసేపు అక్కడ ఆగివున్నట్టు గుర్తించాడు.

అంత చిన్న కా ఏమయి వుంటుంది?

వెంటనే స్ఫురించింది—మారుతి కారు! అంటే, దుండగులు బహుశా ఆ కారులో డబ్బు తీసుకొని పారి

పోయి వుండాలి.

అయితే, ఆ డాలరు అర్థమేమిటి? దొంగలు శాంతి కాముకులు, సర్వ మానవ కళ్యాణంకోసం పాటుపడే విశాల హృదయాలూ అనుకోవాలా?

ఏదో అర్థం నిగూఢమయి వుంది ఆ బొమ్మలో. ఏమిటది?

దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు కిరణ్.

అతని దృష్టి నేలమీద పొడవుగా జాడపడిన నల్లటి మరకలమీద పడింది.

అవి ఆయిల్ మరకలు—డీజిల్ ఆయిల్ మరకలు! ఏ కారణంచేతనో ఆయిల్ టాంక్ చిల్లుపడి, ఆయిల్ దారిపొడవునా కార్తూపోయింది.

ఆ మరకలు సిటీకిపోయే దారినే సూచిస్తూన్నాయి.

కిరణ్ పెదాలమీద చిరునవ్వు లీలగా మెరిసింది. చాలా ముఖ్యమైన క్లూ దొరికింది!

కిరణ్ శ్రీనివాస్ వంక తిరిగి, "మనకి దొంగల జాడ చాలా తేలిగ్గా దొరికిపోయింది. వెంటనే బయల్దేరటమే తరువాయి" అన్నాడు.

శ్రీనివాస్ తన సిబ్బందితో జీప్ ఎక్కాడు. కిరణ్ పరాంకుశంవైపు చూసి, "త్వరలోనే మీ సొమ్మును తిరిగి స్వాధీనం చేసుకొని మీకు అప్పగిస్తాం. మీరిక ఇంటికి వెళ్ళండి" అన్నాడు.

పరాంకుశం ముఖంలో ఆశారేఖ మెరిసింది.

"మీ ఋణం వుంచుకోను" అన్నాడు.

ముందు కిరణ్ టయోటా, వెనకగా శ్రీనివాస్ జీప్ ఆయిల్ మరకల జాడలో బయల్దేరాయి.

10

"వచ్చావా శ్యామూ, నీకోసం యెదురుచూసి చూసి, ఇంతక్రితమే పోలీస్ రిపోర్టుకూడా ఇచ్చాను" అన్నాడు బాబూరావు.

భార్యను చూడగానే అతనంతవరకు అనుభవించిన టెన్షన్, ఆరాటం, మనోక్షోభ అన్నీ మరచిపోయాడు.

శ్యామల అంతదాకా నిద్రపోకుండా తనకోసం యెదురుచూస్తూన్న పిల్లలిద్దర్ని అక్కున చేర్చుకున్నది. పిల్లలిద్దరు మళ్ళీ అమ్మ కనిపించదేమోనన్నంత తమకంతో తల్లి నల్లుకుపోయారు.

"అన్నం తిన్నారా బాబూ!" అంటూ పిల్లల బుగ్గలు పుణికి ముద్దాడింది.

"సినిమాకి వెళ్ళావా శ్యామూ!" భార్య ముఖంలోకి ప్రేమగా చూస్తూ అడిగాడు బాబూరావు.

"లేదండీ!... ఏమండీ. మీకు తెలియకుండా నేనో పనిచేశాను. నన్ను క్షమిస్తారు కదూ....!?"

"నువ్వు తప్పుపనేదీ చెయ్యవని నాకు తెలుసు శ్యామూ!.... చెప్పమని నిన్ను బలవంతపెట్టను. చెప్పా లనుకుంటే చెప్పు, లేకుంటే ఆ సంగతి మర్చిపో!"

"అదేంకాదు, మీకు చెప్పితీరాలి!"

"అలాగే చెపుదువుగాని, ముందు స్నానంచేసి భోం చెయ్యి. ఏ టైంలో వస్తావోనని వంటచేసి సిద్ధంగా వుంచాను. పిల్లల్ని తినమంటే నువ్వొస్తేనేగాని తినమని భీష్మించుక్కూచున్నారు. వాళ్ళకి నచ్చచెప్పలేక సత మతమవుతుంటే నువ్వొచ్చావు."

"అలాగా, చాలా టైమయ్యింది. ముందు పిల్లలకి అన్నాలు పెట్టాకనే నా స్నానపానాలు!" అంటూ

పిల్లలని లోపలి గదిలోకి తీసుకువెళ్ళింది శ్యామల.

వాళ్ళకి అన్నాలు పెట్టి ముందు గదిలోకి వచ్చి నోట్లు తీసి భర్తకందించి, "ఇవి జాగ్రత్తగా పెట్టండి" అన్నది.

బాబూరావు ఆశ్చర్యాన్నణుచుకుంటూ ఆ డబ్బు వైపు భార్యవైపు మార్చి మార్చి చూశాడు. అతని కళ్ళల్లో కోటి సందేహాలు, శతకోటి సంశయాలు గుర్తించింది శ్యామల.

"మీకంతా వివరంగా చెపుతాను. నన్ను మనస్ఫూర్తిగా క్షమిస్తానని మాటివ్వండి" చేయి సాచింది శ్యామల.

ఆ చేతినందుకోకుండానే, "చెప్పు!" అన్నాడు బాబూరావు.

శ్యామల అతని ముఖంలో వచ్చిన మార్పులని శ్రద్ధగా గమనించింది. చిన్నగా నిట్టూర్చింది.

చెప్పటం మొదలుపెట్టింది.

11

"వెల్ డన్ బాయ్స్! నాకు అన్నివిధాల మీ సహకారాన్ని అందించారు, చాలా సంతోషం. ఇదిగో మీ షేర్ ...." నోట్లకట్టలు అందించాడు స్వామి.

గోపాల్, జలీల్ అతనిచ్చే నోట్లు అందుకోలేదు.

"కమాన్ ఫ్రెండ్స్. తీసుకోండి. మీ మాట మీరు నిలబెట్టుకున్నారు. మీ కిస్తానన్న పారితోషికాలు చెల్లించవలసిన బాధ్యత నామీద వుండిపోయింది...." అన్నాడు స్వామి.

"వద్దు సార్! ఇదికూడా మీ దగ్గరే వుంచండి. లోకంలో ఒకపూటకూడా తిండిలేనివాళ్ళు యెందరో వున్నారు. వాళ్ళ సంక్షేమానికి ఉపయోగించండి. మీ

సాహచర్యంవల్ల మాకూ కొంత పరోపకార బుద్ధి అల వడింది. మేమెలాగైనా బతగ్గలం. బతకలేక, చావలేక నికృష్టంగా రోజులు వెళ్ళదీస్తూన్న దరిద్రనారాయణుల కోసం మీరు పడ్తున్న శ్రమ, కృషి మా జీవితంలో గొప్ప అనుభవాన్ని నేర్పాయి. ఆ అనుభవసారంతో మా జీవితాలు చక్కదిద్దుకుంటాం" అన్నాడు దిలీప్.

"మిమ్మల్ని చూస్తూంటే నాకు చాలా ఆనందంగా వుంది.... ఈ రోజు మీరు ఓ స్వార్థపరుడు, శ్రమజీవుల రక్తాన్ని మధుపానంలా పీల్చుకుని కోటికి పడగలెత్తిన మనసులేని యజమాని అయిన పరాంకుశాన్ని మోసంచేసి డబ్బు దోచుకున్నారు. అయితే ఇది నిజానికి మోసం కాదు, పాపం అసలే కాదు. యే పనివాళ్ళు రక్తాన్ని చెమటగా మార్చి తన వైభవానికి కారకులయ్యారో వాళ్ళని అలక్ష్యంచేసి, అతి తక్కువ జీతాలిచ్చి వాళ్ళ కడుపులు మాడ్చి వాళ్ళ భార్యాబిడ్డల ఉసురుపోసు కుంటున్న ఓ రాక్షసుడికి తగిన బుద్ధి చెప్పారు. ఓ గుణ పాఠం నేర్పారు.

దిలీప్, గోపాల్ చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకొని, "పరాంకుశంలాంటి రాక్షసులు ఈ దేశంలో చాలా మందున్నారు. వాళ్ళందరికి గుణపాఠం నేర్పాలి. వాళ్ళ అన్యాయార్జితాన్ని న్యాయంగా యెవరికి చెందాలో వాళ్ళకి సమానంగా పంచాలి. అందుకు మా వంతు కృషి, సాయం మమ్మల్ని చెయ్యనివ్వండి సార్!" అన్నాడు ఆవేశంగా.

"అరుంధతీ....!" అంటూ పిలిచాడు స్వామి.

అరుంధతి లోనికొచ్చింది. "ఆ అమ్మాయి లందర్నీ పంపించేశావు కదూ....!?" అన్నాడు స్వామి.

"వాళ్ళు వెళ్ళనని మొండికేసి కూచున్నారు. అతి కష్టంమీద నచ్చచెప్పి ఇప్పుడే పంపించాను" అన్నది అరుంధతి.

"ఇప్పటికే చాలా ఆలస్యమయింది అరుంధతీ! సంసారం చేసుకుంటున్న ఆడవాళ్ళు కదా! భర్తలు అనుమానించి వాళ్ళను విడిచిపెట్టేసే ఆ పాపం మనల్ని చుట్టుకుంటుంది" ఆవేదనగా చెప్పాడు స్వామి.

"ఏరోజు కారోజు ఆ పిల్లల్ని వెళ్ళిపోమని చెప్తూండేదాన్ని, కాని వాళ్ళు మన సంస్థను వదిలి వెళ్ళమని, ఇక్కడి ఆశయాలు వాళ్ళ మనసును హత్తుకున్నాయని, లేనివాళ్ళకు సాయపడటంలో తమ వంతు పాత్ర తాము కూడా వహిస్తామని ఉండిపోయారు. చివరికీ రోజు అందర్నీ జాగ్రత్తగా వాళ్ళ ఇళ్ళకు చేర్చాం" అన్నది అరుంధతి.

"గుడ్! మగపిల్లలు ఎన్నిరోజులున్నా ఫరవాలేదు. ఆడవాళ్ళ విషయంలో యేరోజు కారోజు ఇళ్ళకు పంపి తీరాలి, గుర్తుంచుకో!" అన్నాడు స్వామి.

సరిగ్గా అప్పుడే డిటెక్టివ్ కిరణ్, శ్రీనివాస్ ఆ గదిలోకి అడుగుపెట్టారు.

"హేండ్సప్! ఎవరూ కదలొద్దు" అన్నాడు కిరణ్ రివాల్వర్ సూటిగా స్వామికి గురిచేస్తూ.

అంతక్రితమే ఆ భవనం చేరుకున్నారు డిటెక్టివ్ సిబ్బంది. జయిల్ మరకలు ఆ భవనంముందు వరకువచ్చి ఆగిపోయాయి.

గారాజ్‌లో బ్రౌన్ కలర్ మారుతి కారు కనిపించింది. ఆ భవనంముందు 'అనాధ శరణాలయం' అన్నబోర్డు వేలాడుతోంది. అంత పెద్ద భవంతిలో అనాధశరణాలయం యెవరూ నిర్వహించరు. కిరణ్ అనుమానం బల

పడింది.

శ్రీనివాస్‌తో మెల్లిగా లోపలికి ప్రవేశించాడు. కాపలా వున్న ఇద్దరు యువకులు పరుగెత్తి లోపలకు ఇన్ఫర్మేషన్ అందివ్వబోయేంతలో వాళ్ళని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఎదురుగా హాలులాంటి పొడవైన నడవా కనిపించింది వాళ్ళకు. గోడ పైభాగంలో వెండి మలాము చేసిన పావురం స్వేచ్ఛగా ఎగురుతున్నట్టు చిత్రింపబడింది. దానికింద మిలమిల మెరుస్తూన్న వెండి అక్షరాలు— 'సర్వ మానవ సౌభ్రాతృత్వం మన ధ్యేయం' అని.

దాంతో కిరణ్, శ్రీనివాస్ బృందానికి సందేహం విడిపోయింది.

సరిగ్గా అప్పుడే లోపల హాల్లోనించి మాటలు విని పిస్తూండటంతో ఆగిపోయి విన్నారు కిరణ్, శ్రీనివాస్‌లు.

గోపాల్ దిలీప్‌లతో స్వామి జరుపుతున్న చర్చ, అరుంధతితో స్వామి ఆడవాళ్ళ గురించి ఆడుగుతున్న సంగతులు వాళ్ళ చెవిన పడ్డాయి.

వెంటనే రంగంలోకి దిగారు.

కిరణ్‌ని, పోలీసుల్ని చూడగానే ఒక్క క్షణం స్వామి, అరుంధతితోబాటు ఆ హాల్లో వున్న వారందరు నిర్ఘాంతపోయారు.

అయితే ఎవరూ తప్పించుకుపోయే ప్రయత్నం చెయ్య లేదు.

అందరు చేతులు పైకెత్తి నిల్చున్నారు.

"కమాన్ ఇన్‌స్పెక్టర్! మావల్ల కావలసిన సహాయ మేదైనా ఉందా?" అన్నాడు స్వామి చిరునవ్వు

నవ్వుతూ.

"నువ్వు చేస్తున్న అక్రమ వ్యాపారం గురించి మాకు తెలిసిపోయింది. నిరుద్యోగ యువకుల్ని, సంసారం చేసుకుంటున్న స్త్రీలని ట్రాప్ చేసి తీసుకొచ్చి వాళ్ళద్వారా లక్షలు సంపాదిస్తున్నావు. వాళ్ళకి దొంగతనాలు, మోసాలు నేర్పుతున్నావు. ఇది క్షమించరాని నేరం" అన్నాడు కిరణ్ సూటిగా స్వామి కళ్ళలోకి చూస్తూ.

స్వామి యేమాత్రం తొణకలేదు.

"నిజం సార్! మీరు చెప్పిందాంట్లో అసత్యంగాని, అతిశయోక్తిగాని లేవు. ఈ యువకుల్ని వాళ్ళ యిష్టం మీదే తీసుకొచ్చాను. అలాగే మహిళలని కూడా. అందుకు వాళ్ళకి పారితోషికాలు చెల్లించాం కూడా" అన్నాడు.

"వాళ్ళ ద్వారా లక్షలు ఆర్జించి కొన్ని వేలు వాళ్ళ మొహాన కొడుతున్నావు. నువ్వు ఆ డబ్బుతో కులుకుతున్నావు..."

"స్టాప్ ఇట్ ఇన్‌స్పెక్టర్! ఆ డబ్బుతో ఏంచేస్తున్నానో ఇలా చూడండి...." అంటూ స్టీలు అల్మయిరానుంచి పెద్ద పెద్ద చిఠాలు, రెండు పుస్తకాలుతీసి టేబిల్ మీద పెట్టాడు స్వామి.

"ఇవి చూడండి, మీకే అర్థమవుతుంది" అన్నాడు గంభీరంగా స్వామి.

కిరణ్ ఆ పుస్తకాలని పరిశీలించాడు.

వివిధ అనాథశరణాలయాలకు, విద్యాసంస్థలకు, యే ఆధారంలేని స్త్రీల సంక్షేమానికి, స్త్రీ సదనాలకి ఇంకా యెన్నోరకాల ప్రజాహిత సంస్థలకి ఎప్పుడెప్పుడు యెంత మొత్తంలో విరాళాలు ఇచ్చినదీ వివరంగా

రాయబడి వున్నది అందులో.

శ్రీనివాస్ కూడా పరిశీలనగా చూశాడు.

స్వామి గొంతు విప్పాడు.

"నేను మోసం చేసినదీ, దొంగతనాలు చేయించినదీ సామాన్యుల్ని కాదు. బడా బడా వ్యాపారుల్ని, బడుగు వాళ్ళని అణగదొక్కి వాళ్ళను మెట్లుగా చేసుకొని సమాజంలో అత్యున్నత స్థాయిని అధిరోహించిన మిలియనీర్స్‌ని— నేను వాళ్ళనుంచి సంపాదించిన మొత్తం వాళ్ళు ఎగ్గొట్టిన ఆదాయపు పన్నులో పదోవంతు కూడా ఉండదు. వాళ్ళ ఇనప్పెట్టెల్లో మూలుగుతున్న సొమ్మును బయటికితీసి, పీడితులకి, బాధితులకి పంచిపెడుతున్నాను."

"స్టాపిట్! నువ్వు చేస్తూన్నది పెద్ద నేరమని నీకు తెలియదా? చేతనైతే నీ సొంత సొమ్మని వాళ్ళందరికీ ఖర్చుపెట్టు. లేకుంటే కష్టించి సంపాదించి దాన్ని వాళ్ళకివ్వు—అంతేగాని అన్నెం పున్నెం యెరగని యువకులని మోసం, దగా నేర్పి వాళ్ళచేత హింసాత్మక కార్యకలాపాలు చేయిస్తావా? సంసారాలు చేసుకుంటున్న స్త్రీల జీవితాలతో ఆడుకుంటావా....?"

కిరణ్ గొంతు తీవ్రంగా పలికింది.

"మీరు పొరబడుతున్నారు. నేను స్త్రీల జీవితాలతో ఆడుకోవటంలేదు. లోకంలో వున్న కాముకులైన ధనవంతుల్ని వాళ్ళద్వారా ఆకర్షింపచేసి హోటల్స్‌కి రావించి, నా దగ్గరున్న యువకుల్ని పోలీసు వేషాల్లో పంపించి వాళ్ళని అరెస్టు చేయించినట్టు నటించి, వాళ్ళనుంచి వీలైనంత సొమ్ము రాబట్టి అనక వదిలేస్తున్నాను. పరువు భయంతో ఆ ఖరీదైన కాముకులు తమని నిలువు

దోపిడీ చేసినా నోరు కట్టుకుండా పోతున్నారు. మళ్ళీ ఈ జన్మలో భార్యతప్ప పరాయి ఆడదాని ఒంటిమీద చెయ్యి వెయ్యగల ధైర్యం చెయ్యరు వాళ్ళు."

"కాని, అందుకోసం సంసారాలు చేసుకుంటున్న స్త్రీలే కావలసివచ్చారా నీకు?"

"క్షమించాలి! వాళ్ళయితే తెలివిగా వ్యవహరించ గలుగుతారు. జీవితంతో బాగా రాజీపడిపోయిన మధ్య తరగతి ఆడవాళ్ళనే కావాలని ఎన్నుకున్నాను. అయితే గుండెలమీద చేయి వేసుకుని చెప్తున్నాను, వాళ్ళ శీలాన్ని మలినం చెయ్యటంగాని చెయ్యించటంగాని జరగలేదు. చివర్లో వాళ్ళ కష్టానికి తగిన ప్రతిఫలం ముట్టచెప్పి వాళ్ళ ఇళ్ళకు క్షేమంగా చేర్పించాం కూడా .... చాలామంది మాతోనే వుండిపోయి ప్రజాహిత కార్యక్రమాల్లో తాము కూడా పాల్గొంటామని, తిరిగి తమ ఇళ్ళకు వెళ్ళటానికి విముఖత చూపించారు. ఈ కోణంతో వాళ్ళందరికీ యెంత గానో నచ్చచెప్పి పంపేశాము" చెప్పాడు స్వామి.

"కాని ...నువ్వు చేసిన ప్రతి పనీ చట్టానికి వ్యతిరేక మైనదే! శిక్షార్హమైనదే! ఒక సామాజిక హితైషిగా నువ్వు చేసిన పనుల్ని హర్షించగలనుగాని, నువ్వు ఎన్నుకున్న మార్గాన్ని హర్షించలేను, గర్హిస్తూన్నాను. చట్టం విధించబోయే శిక్ష ననుభవించటానికి సిద్ధంగా వుండండి. నువ్వు, నీ అనుంగు చెలికత్తె అరుంధతీను. నీతోబాటు ఈ యువకులకి కూడా శిక్ష తప్పదు...." చెప్పాడు రాజ్.

స్వామి, అరుంధతి రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టి, "మా ఇద్దరికీ ఉరిశిక్ష విధించినా మహదానందంగా ఉరికంబమెక్కుతాం. కాని ఈ నిరుద్యోగ

యువకుల్ని శిక్షకు గురిచేసి వాళ్ళ కుటుంబాలకి ఆధారం లేకుండా చెయ్యకద్దు" అంటూ వేడుకున్నారు.

"మీ ప్రేరణవల్ల వాళ్ళు ప్రవర్తించినందుకు శిక్ష తక్కువ పడేలా చెయ్యగలముగాని, చట్టానికప్పగించకుండా వదిలేది లేదు, మిస్టర్ శ్రీనివాస్, నీ పనికానివ్వు" అన్నాడు డిటెక్టివ్ కిరణ్.

స్వామి, అరుంధతి చేతులు ముందుకు చాచారు.

అయితే వాళ్ళిద్దరి కళ్ళలోను దివ్యకాంతులు మెరుస్తూన్నాయి. తాము చేసిన పరోపకార చింతన వాళ్ళ పెదాలమీద సంతృప్తితో కూడిన చిరునవ్వు రూపంలో తళుక్కుమన్నది.

శాంతికి సాంకేతమైన పావురం స్వేచ్ఛగా గాల్లో ఎగుర్తోంది!

—: అయిపోయింది :—